# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

సోమవారం | 14 జూలై 2025 | పేజీలు 8




రోడ్డు విస్తరణలో దుండిగల్ మండల సర్వేయర్ సర్వే..

# వాట్ ఏన్ ఐడియా సర్‌జీ..!

## ఇక్కడ రోడ్డు వేస్తేనే..! అక్కడ హెచ్ఎండిఏ అనుమతులు మంజూరు..

- దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేట్ వ్యవసాయ భూముల్లో రోడ్డు పనులు..
- హెచ్ఎండిఏ రోడ్డు అంటూ కమిషనర్ తప్పించుకునే ప్రయత్నం..
- వెంచర్ అనుమతి కోసమే ఆగమేఘాల మీద 40 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులపై విమర్శలు..
- పొంతన లేని సమాధానంతో మున్సిపల్ కమిషనర్ తిప్పలు..?
- ప్రభుత్వ అధికారుల సహకారంతో.. ప్రైవేటు వెంచర్‌కి రోడ్డు పనులు..?
- ప్రశ్నించిన ఒక్కో రిపోర్టర్‌కి ఒక్కో విధంగా సమాధానం ఇస్తున్న అధికారులు..
- సుమారు అర కిలోమీటర్ మేర 166 ప్రభుత్వ భూమికి అధికారుల ఎసరు..?
- రూ.కోట్లలో డబ్బులు చేతులు మారాయని గుప్పుమంటున్న ఆరోపణలు..?

- ప్రైవేట్ వెంచర్ అనుమతుల కోసం..! ప్రభుత్వ భూమిలో రోడ్డు..?
- రెవెన్యూ-మున్సిపల్ సమన్వయంతో..! ఈ అక్రమ రోడ్డుకు శ్రీకారం..
- అధికారుల అనుగ్రహం..! అక్రమార్కులకి వరంగా మారిన వైనం..!

- ఫారెస్ట్ అనుమతి లేకుండానే.. పచ్చని చెట్లను నరికి.. పర్యావరణ విధ్వంసం..
- స్పష్టతలేని మున్సిపల్ కమిషనర్ సమాధానంపై సందేహాలు..
- పై అధికారుల కళ్ళుగప్పి రియల్టర్‌తో అధికారుల కుమ్మక్కు..?

- 2019 మున్సిపల్ యాక్ట్..! సెక్షన్ 176 ప్రకారం 6 నోటీసులు జారీ..!
- టిడిఆర్ చెల్లిస్తామని రైతులను బలవంతంగా ఒప్పించిట్లు ఆరోపణలు..
- వివరాల వెల్లడికి అధికారుల నిరాకరణ.. స్పష్టతలేని మున్సిపల్ కమిషనర్ వివరణ.
- సంబంధమే లేనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ.. సర్వే చేసిందే సర్వేయర్..
- రిపోర్టర్లను చూడగానే నిర్మాణ పనులు వదిలేసి మున్సిపల్ సిబ్బంది పరార్..?

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 13:** అవసరం లేని రోడ్డుకోసం, రెండు శాఖల అధికారుల పాకులాట పలు అనుమానాలకు తావిస్తోంది..! నిర్జన ప్రదేశంలో హెచ్ఎండిఏ మ్యాప్‌లో 100 ఫీట్ల రోడ్డు ఉందనే నెపంతో..! అత్యవసరంగా 40 ఫీట్ల రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నారు.. ఏదో గ్రామ ప్రజలు నివసించే చోటు కూడా కాదు.. కేవలం వ్యవసాయ భూముల్లో రైతులు వెళ్ళేందుకు, 10 ఫీట్ల పాత డొంకదారి ఉంది..! అంతకు మించి అవసరం కూడా లేదు.. అయినప్పటికీ 40 ఫీట్ల రోడ్డు విస్తరణకు శరవేగంగా పనులు చేపట్టడం.. అడ్డొచ్చిన పచ్చని వృక్షాలను నరికి ప్రకృతిని విధ్వంసం చేస్తూ.. పర్యావరణానికి విఘాతం కలిస్తున్నారు.. ఈ వ్యవహారంలో దుండిగల్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులే కీలకంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. మరోవైపు రోడ్డు ఆక్రమణలో ప్రభుత్వ భూమి ఉందన్న ఫిర్యాదుతో.. జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశానుసారం శనివారం దుండిగల్ తహాశీల్దార్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.. రోడ్డుకు అడ్డంగా కందకాలు తవ్వించి పనులు నిలిపివేశారు..చెట్లు నరికిన విషయంలో ఫారెస్ట్ అధికారులు జరిమానా విధించినట్లు ఎఫ్ఆర్వో దూలపల్లి పెన్ పవర్ ప్రతినిధితో తెలిపారు..

-2లో



బౌరంపేట్‌లో రోడ్డు విస్తరణ పనులు..

రోడ్డు విస్తరణతో నడిరోడ్డుకు వచ్చిన బోరుబావి..

రోడ్డును విస్తరణకు శరవేగంగా పనుల్లో డోజర్‌తో చదును..

## హైదరాబాద్ గచ్చిబౌలిలో ఈగల్ టీమ్ డెకాయ్ ఆపరేషన్.. 14 మంది ఐటీ ఉద్యోగులు అరెస్ట్..




**హైదరాబాద్ పెన్ పవర్:** డ్రగ్స్, గంజాయి వినియోగంపై ఉక్కుపాదం మోపుతోంది 'ఈగల్' టీమ్. హైదరాబాద్ లో ఎక్కడ మాదక ద్రవ్యాల వినియోగం జరిగినా మెరుపు దాడి చేసి పట్టుకుంటోంది. అందులో భాగంగా ఆదివారం (జులై 13) గచ్చిబౌలిలో గంజాయి, డ్రగ్స్ వినియోగం జరుగుతోందనే సమాచారంతో నిఘా వేసి దాడులు చేసింది. డెకాయ్ ఆపరేషన్ చేపట్టి 14 మంది డ్రగ్స్ వినియోగదారులను అరెస్ట్ చేసింది. ఆదివారం మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు

-3లో

## ధూమ్ ధామ్‌గా లష్కర్ బోనాల జాతర..
# నేడు రంగం భవిష్యవాణి



**హైదరాబాద్ పెన్ పవర్:**లష్కర్ బోనాలు ధూమ్ ధామ్ గా జరుగుతున్నాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాంకాళీ బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం (జలై 13) ఉదయం 4 గంటలకు ఉజ్జయినీ అమ్మవారి ద్వారలు తెరవడంతో ప్రారంభమైన బోనాల ఉత్సవానికి ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ఉత్సవాలలో ఎంతో ప్రత్యేక ఘట్టమైన రంగం భవిష్యవాణి

-3లో


# వాట్ ఏన్ ఐడియూ సర్‌జీ..!



అక్రమ రోడ్డు విస్తరణలో ప్రకృతి విధ్వంసం..



అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో తహశీల్దార్ ఆధ్వర్యంలో రోడ్డు డిమాలిషన్..




ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం..

> **వ్యవసాయ భూములకు వెళ్ళడానికి ఉన్న 10 ఫీట్ల డొంకదారిని, 40 ఫీట్లుగా విస్తరింపజేయడం ఇంత సులభమా..? ఇంతకీ హెచ్ఎండిఏ రోడ్డు విస్తరణ పనులు, ఆ హెచ్ఎండిఏ అధికారులకు అయినా తెలుసా..? తెలియదా..? దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో, దాదాపు వందకు పైనే 100 ఫీట్ ప్రపోజ్డ్ రోడ్లు ఉన్నాయి.. అవి కేవలం హెచ్ఎండిఏ మ్యాప్‌లకే పరిమితం..! అవి మొత్తం రోడ్లు నిర్మించడానికి మున్సిపల్ కమిషనర్ చొరవ చూపుతారా..? మున్సిపల్ పరిధిలో ఇప్పటికీ అస్తవ్యస్తంగా తయారైన గుంతల రోడ్డులు అనేకం దర్శనమిస్తాయి..! ప్రమాదకర అక్రమ కట్టడాల గురించి ఇక చెప్పే అవసరమే లేదు.. మున్సిపల్ అండ్ రెవెన్యూ అధికారుల బాధ్యతా రహితం కూడా అదే స్థాయిలో ఉంది..**

**- మొదటి పేజి తరువాయి**

హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్ల దారి ఉందన్న సాకుతో..! రెవెన్యూ, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో, 40 రోడ్డు నిర్మాణానికి శరవేగంగా పనులు చేపట్టి, సహకరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. ఈ వ్యవహారం వెనుక ఓ ప్రైవేటు వెంచర్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. హెచ్ఎండిఏ పర్మిషన్ లభించాలంటే ఈ రోడ్డు ప్రాముఖ్యత అత్యంత విలువైనది.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బౌరంపేట్ గ్రామ పరిధిలో ఉన్న రింగ్‌రోడ్డు వద్ద, సర్వీస్ రోడ్డు నుండి లోపలికి వ్యవసాయ భుములకు రైతులు వెళ్ళాలంటే పూర్వం నుండి 10 ఫీట్ల డొంకదారి ఎడమ వైపుకు ఉంది.. కుడివైపుకు హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్ల ప్రపోజ్డ్ రోడ్డు ఉన్నట్టు కమిషనర్ చెబుతున్నదే..! ప్రజల సమస్యలు, అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టలేని మున్సిపల్ అధికారులు..! ప్రభుత్వ భూమి కబ్జాలను అరికట్టలేని రెవెన్యూ అధికారులు.. ఈ రెండు శాఖల సమన్వయంతో 10 ఫీట్ల డొంకదారిని 40 ఫీట్ల వెడల్పుతో విస్తరించేందుకు పనులు వేగవంతం చేశారు..

40 ఫీట్లకు రోడ్డు హద్దులు నిర్ణయించేందుకు.. దుండిగల్ మండల సర్వేయర్, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సంయుక్తంగా సర్వే నిర్వహించినట్లు తెలుస్తోంది.. మరోవైపు డూప్లెక్స్‌ల నిర్మాణాల వెంచర్‌కి హెచ్ఎండిఏ అనుమతులు లభించాలంటే ఈ 40 ఫీట్ల రోడ్డు ఉంటేనే పర్మిషన్ లభిస్తుంది..



రోడ్డుకు అడ్డంగా కందకాలు తవ్వుతున్న జేసిబి..

## ఎవరి లాభాపేక్ష కోసం ఈరోడ్డు నిర్మాణం..

బౌరంపేట్ వ్యవసాయ భూముల్లో, అవసరం లేనిచోట, నిబంధనలకు వ్యతిరేకంగా..! చట్టాలను శోధించి, లొసుగులకే ప్రాధాన్యత ఇస్తూ..! హెచ్ఎండిఏ రోడ్డు నిర్మాణం పేరుతో 40 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు ఎవరి లాభాపేక్ష కోసం..?ఒకవేళ 100 ఫీట్ల రోడ్డు నిజమైతే 40 ఫీట్ల రోడ్డు మాత్రమే ఎలా వేస్తారు..? రోడ్డు విస్తరణకై రైతులు దరఖాస్తు చేసుకున్నారని, అందుకు మున్సిపల్ యాక్ట్ 2019 లోని, సెక్షన్ 176 ను అనుసరించి..! 6 మంది రైతుల భూముల సేకరణకు, టిడిఆర్ చెల్లించే విధంగా, నోటీసులు జారీచేసినట్లు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ చెబుతున్నారు.. రోడ్డు నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని సంబంధిత రైతులే భరిస్తారని, మున్సిపల్‌కి సంబంధం లేదని మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ నాయక్ వివరణలో నిజమెంత..? ఈ వ్యవహారంలో మున్సిపల్‌కి స్థలం అప్పగించే ప్రక్రియ ఏమైంది సారూ.. పైనుండి ఆమోదం లేకుండా సొంత నిర్ణయాలు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు..

## కమిషనర్ పొంతనలేని సమాధానం..

రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో పాటు అధికారుల ఆరాటం దేనికోసంమో..? తెలియదు కానీ..! రోడ్డు విస్తరణ పనులు మాత్రం, దగ్గరుండి చేయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. మరోవైపు బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి ఒకరోజు..! ఆ మరుసటి రోజే కమిషనర్ పనులు పర్యవేక్షించడం.. ప్రశ్నించిన ఓ విలేకరికి అక్రమ రోడ్డుపై ఫిర్యాదు వచ్చిందని, పరిశీలనకై అంటూ, దాటవేసే ధోరణితో సమాధానం దేనికోసం..? హెచ్ఎండిఏ "నోట్‌ఫైల్", టౌన్‌ప్లానింగ్ అధికారి వద్ద ఉందని చెప్పిన కమిషనర్ వెంకటేష్ నాయక్..! మరుసటి రోజు, నోట్ ఫైలే లేదని, ఆ విషయాన్ని చెప్పలేదని చెప్పడం విశేషం.. రైతుల దరఖాస్తుతో, నోటీసులు జారీ చేసినట్లు, మాట మార్చడం, అసలు తమకు, రోడ్డుకు, సంబంధం లేదని కమిషనర్ మాటలు పలు అనుమానాలను రేకెత్తిస్తుంది..

## అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో డిమాలిషన్..

దుండిగల్ మున్సిపల్, రెవెన్యూ అధికారుల సొంత నిర్ణయాలతో, జరుగుతున్న అక్రమ రోడ్డు విస్తరణలో, ప్రభుత్వ భూమి ఆక్రమించారనే ఫిర్యాదులపై మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పందించారు.. సంబంధిత రోడ్డుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌ను ఆదేశించారు.. దుండిగల్ తహశీల్దార్ మతీన్, ఆర్ఐ రవికుమార్ రెవెన్యూ సిబ్బందితో వెళ్ళి, శనివారం జేసిబితో రోడ్డుకు అడ్డంగా కందకాలు తవ్వారు.. పనులు చేయకూడదని హెచ్చరించారు..

## ప్రభుత్వ భూమి ఆక్రమణ.. ప్రకృతి విధ్వంసం..

అవసరం లేని రోడ్డుకు, రెండు శాఖల అధికారుల అత్యుత్సాహం తోడై..! ప్రభుత్వ భూమి ఆక్రమణతో పాటు.. ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారు.. ఈ రోడ్డు పనుల్లో భాగంగా అడ్డొచ్చిన భారీ వృక్షాలను తొలగించే ముందు సంబంధిత అటవీశాఖ అధికారుల అనుమతి పొందాలనే అవగాహన లేకపోగా.. మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోకపోవడం తీవ్రంగా విమర్శలు వస్తున్నాయి.. మరోవైపు ఈ విస్తరణ పనుల కారణంగా, పంట పొలాల్లో ఉండాల్సిన భోరుబావి, రోడ్డు మధ్యలోకి వచ్చింది..బౌరంపేట్ సర్వే నెంబర్ 166 ప్రభుత్వ భూమిని సుమారు "అర కిలోమీటర్" దూరం ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు..

# ఈసారి కూడా రెడ్లకు ఆశాభంగమేనా? మళ్లీ భర్తీ చేసినా వీరి పేర్లు పరిశీలనలో ఉండవా?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ కాంగ్రెస్ లో రాజకీయాలు నిరంతరం వేడిపుట్టిస్తూనే ఉంటాయి. మంత్రి వర్గ విస్తరణ అధినాయకత్వం ఎలాగోలా పూర్తి చేసింది. రేవంత్ రెడ్డి కేబినెట్ లో మొన్నటి వరకూ మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉండగా అందులో మూడింటిని మాత్రమే భర్తీ చేశారు. ఎస్సీల్లో మాల, మాదిగ సామాజికవర్గానికి చెందిన నేతలతో పాటు బీసీ సామాజికవర్గానికి చెందిన నేతకు ఇచ్చారు. మంత్రివర్గం విస్తరణ జరిగిన వెంటనే కొంత అసంతృప్తులు బయటకు వచ్చినప్పటికీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షినటరాజన్ లు అసంతృప్త నేతలను బుజ్జగించారు. స్థానికసంస్థల ఎన్నికల తర్వాత మిగిలిన మూడు పోస్టులను భర్తీ చేస్తామని పార్టీ హైకమాండ్ చెబుతుంది.




**నియోజకవర్గానికే పరిమితమవుతూ...**

అయితే తనకు మంత్రి పదవి దక్కని నేతలు మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. తమ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమవుతున్నారు. అంతే తప్ప తాము రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై వారు స్పందించడం లేదు. భవిష్యత్ లోనూ మంత్రి పదవి దక్కుతుందన్న గ్యారంటీ మాత్రం లేదని తెలిసిన తర్వాత పూర్తిగా నిరుత్సాహంలో పడిపోయారు. అందులో ప్రధానంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒకరు. ఆయన తనకు మంత్రి పదవి తప్పకుండా వస్తుందని భావించారు. ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే అనేక కారణాల వల్ల ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.

**కోమటిరెడ్డి ఆశలు...**

తనకు మంత్రి పదవి వస్తుందని, హోంమంత్రి పదవి ఆశిస్తున్నట్లు కూడా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో అన్నారంటే ఆయన ఎంత కాన్ఫిడెన్స్ గా ఉన్నారో అర్థమవుతుంది. తనతో పాటు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన గడ్డం వివేక్ కు మంత్రి పదవి దక్కినా తనకు దక్కకపోవడానికి ప్రధాన కారణం రెడ్డి సామాజికవర్గమేనని అందరికీ తెలుసు. దీంతో పాటు జిల్లా కూడా ఒక కారణం. ఇప్పటికే నల్లగొండ జిల్లా నుంచి తన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. మరో పదవి ఇవ్వాలంటే ఒక కుటుంబంలో ఇద్దరికి అనేది పార్టీ హైకమాండ్ కు కూడా ఇబ్బందికరంగా మారింది. అందువల్లనే మొన్న మంత్రి వర్గ విస్తరణలో రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు.

**మిగిలిన మూడు పోస్టులు కూడా...**

ఇక ఇప్పుడు త్వరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. మంత్రివర్గంలో ముస్లిం సామాజికవర్గానికి చెందిన వారు లేరు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రానున్న మూడు పోస్టులు కూడా ప్రాంతాల పరంగా, సామాజికపరంగా ఇతరులకు కేటాయించే అవకాశముందన్న సమాచారం అందడంతోనే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైలెంట్ గా ఉన్నారని తెలిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల వరకూ కొంత సంయమనాన్ని పాటించి తర్వాత రాజగోపాల్ రెడ్డి తన అసంతృప్తిని బహిరంగంగా వెళ్ల గక్కే అవకాశముంది. చూస్తుంటే ఆ మూడు పోస్టులను కూడా ఇతర సామాజికవర్గాలకు, బలహీనవర్గాలకు కేటాయించి రెడ్ల వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టేయాలన్న యోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న రెడ్డి సామాజికవర్గం నేతలకు మాత్రం ఈసారి కూడా ఆశాభంగమే ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

## హైదరాబాద్ గచ్చిబౌలిలో ఈగల్ టీమ్ డెకాయ్ ఆపరేషన్..

# 14 మంది ఐటీ ఉద్యోగులు అరెస్ట్..

- మొదటి పేజి తరువాయి

ఈగల్ టీమ్ పోలీసులు. పక్కా సమాచారంతో గచ్చిబౌలి లోని %ఎణఖీజ% బ్యాంక్ సమీపంలో ఈ ఆపరేషన్ నిర్వహించి పట్టుకుంది. పట్టుబడిన వారిలో ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, బిజినెస్ మేనేజర్లు ఉన్నట్లు గుర్తించారు. తనిఖీల్లో అందరూ గంజాయి సేవించినట్లు నిర్ధారించి..

ఇటీవల మహారాష్ట్ర నుంచి వచ్చి గంజాయి సరఫరా చేస్తున్న సందీప్ అనే ఈగల్ టీమ్ (%ఝుఖుస్త్రశ్రీవ ఎముఎ%) అరెస్ట్ చేసింది. అతని ఫోన్ కాంటాక్ట్ లిస్ట్ ద్వారా ఈ డెకాయ్ ఆపరేషన్ చేసింది ఈగల్. గంజాయి వచ్చిందంటూ కస్టమర్లకు పోలీసులు మెసేజ్ పెట్టారు. 'భాయ్ బచ్చా ఆగయా భాయ్' అనే వాట్సాప్ కోడ్‌తో గంజాయిని సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ కోడ్ పంపి గచ్చిబౌలిలోని %ఎణఖీజ% బ్యాంక్ దగ్గరలోని ఒక చోటుకి రావాలని ఈగల్ టీమ్ పేర్కొంది. దీంతో రెండు గంటల్లో 14 మంది వినియోగదారులు లొకేషన్‌కి వచ్చారు. వాళ్లందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఐటి ఉద్యోగులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, డెంటల్ టెక్నీషియన్లు ఉన్నారు.

గంజాయి కొనేందుకు భార్య, నాలుగేళ్ల కుమారుడితో..

గంజాయి కొనేందుకు ఓ వ్యక్తి భార్య, నాలుగేళ్ల కుమారుడితో రావడం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఈ 14 మందికి నిర్వహించిన యూరిన్ టెస్ట్‌లో అందరూ డ్రగ్ పాజిటివ్ అని తేలింది. 14 మందిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించారు. నిందితుడు సందీప్ మహారాష్ట్ర నుంచి గంజాయి తెప్పిస్తున్నట్లు గుర్తించారు. సందీప్ తెప్పిస్తున్న ప్యాకెట్లను 50 గ్రాముల చొప్పున తయారు చేసి.. కస్టమర్లకు అందిస్తుంటాడు. ఆ విధంగా 100 గంజాయి ప్యాకెట్లు తెప్పిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఒక్కో ప్యాకెట్ని

రూ. 3 వేలకు సందీప్ అమ్ముతున్నాడు. సందీప్ వద్ద 100 మందికి పైగా కస్టమర్లు ఉన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. సందీప్ వెనకాల ఉన్న ముఠాను పట్టుకునేందుకు దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ధూమ్ ధామ్‌గా లష్కర్ బోనాల జాతర...నేడు రంగం భవిష్యవాణి

- మొదటి పేజి తరువాయి

సోమవారం (జులై 14) నిర్వహించనున్నారు. రంగం కార్యక్రమం కోసం కుమ్మరి ఇంటి నుంచి పండితులు మేళతాళాలతో పచ్చి కుండను ఆలయానికి తీసుకురానున్నారు. ఉదయం 8-9 గంటల ప్రాంతంలో భవిష్యవాణి కార్యక్రమం మొదలవుతుంది. పచ్చి కుండపై నిలబడి మాతంగి స్వర్ణలత భవిష్యవాణి చెప్పనున్నారు. రంగం అనంతరం , ఘనంగా అమ్మవారి అంబారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం పలహార బండ్ల ఊరేగింపు చేబడతారు. ఈ ఊరేగింపు కోసం కర్ణాటక తుంకూరు లోని శ్రీ కరిబసవ స్వామి మఠం నుంచి 33 ఏళ్ల లక్ష్మీ అనే ఆడ ఏనుగును ఇప్పటికే తెలంగాణకు తీసుకువచ్చారు.

అటవీ శాఖ చట్టాల ప్రకారం అన్ని జాగ్రత్తలతో శనివారం(జులై 12) ఏనుగును తీసుకొచ్చారు అధికారులు . ఈ ఏనుగు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతరలో భాగంగా అంబారీ ఊరేగింపులో పాల్గొంటుంది. లష్కర్ బోనాలు ముగిసిన తర్వాత.. 20వ తేదీన మండిలోని నల్లపోచమ్మ, మహంకాళి దేవాలయం, 21వ తేదీన అక్కన్న మాదన్న ఆలయాలకు సంబంధించి అమ్మవారి ఊరేగింపు లో ఏనుగు లక్ష్మీ పాల్గొంటుంది. వేడుకల అనంతరం జూలై 23న ఏనుగును తిరిగి కర్ణాటకకు తరలిస్తారు అధికారులు.

## హైదరాబాద్ రాయదుర్గం పబ్‌లో డ్రగ్స్ కలకలం.. సౌండ్ ఇంజనీర్ అరెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ నార్కో టిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడకంపై ఉక్కుపాదం మోపుతోంది ఈగల్ టీమ్. అందులో ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని డ్రగ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు అధికారులు. అయినప్పటికీ డ్రగ్స్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. అధికారుల కళ్లు గప్పి అక్కడో ఒక్కడో డ్రగ్స్ వాడకం జరుగుతూనే ఉంది. ఈగల్ టీమ్ చేపట్టిన తనిఖీల్లో హైదరాబాద్ రాయదుర్గం ఏరియాలోని పబ్ లో డ్రగ్స్ పట్టుబడటం కలకలం రేపింది.

రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని అబాన్ పబ్‌లో మాదాపూర్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం (జులై 12) అర్ధరాత్రి చేపట్టిన ఈ సోదాల్లో పలువురికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. వివిధ పబ్‌లలో సౌండ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మణి రామన్ అనే వ్యక్తికి నిర్వహించిన డ్రగ్స్ టెస్ట్‌లో గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పబ్‌లో డ్రగ్స్ వినియోగం జరుగుతోందని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఈ దాడులు నిర్వహించారు.

ఈ ఘటనతో నగరంలోని పబ్‌లలో డ్రగ్స్ వినియోగం ఏ స్థాయిలో ఉందో మరోసారి బట్టబయలైంది. పోలీసులు మణి రామన్ పై కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. అంతకు ముందు కొంపల్లిలోని మల్నాడు కిచెన్ రెస్టారెంట్ లో డ్రగ్స్ తో పలువురు అరెస్టైన విషయం తెలిసిందే. హోటల్ యజమాని నైజీరియన్ యువతులతో డ్రగ్స్ సరఫరా చేయిస్తుండటంతో పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లేటెస్ట్ గా రాయదుర్గం పబ్ లో సౌండ్ ఇంజినీర్ డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డుపై మంటల్లో కాలిపోయిన కారు..



**హైదరాబాద్ పెన్ పవర్:**శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ రోడ్డుపై వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలే మొన్న జులై 11న ఆటోను బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయాలపాలైన విషయం తెలిసిందే. లేటెస్ట్ గా అదే రోడ్డుపై.. విమానాశ్రయానికి సమీపంలో కారు ప్రమాదం చోటుచేసుకోవడం ఆందోళనకు గురిచేసింది.ఆదివారం (జులై 13) శంషాబాద్

నాకా దగ్గర ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. ఉదయం 10.55 నిమిషాల ప్రాంతంలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఏదో కాలిపోయిన వాసన వస్తున్నట్లు గుర్తించిన డ్రైవర్.. వెంటనే అప్రమత్తమై అందరినీ కిందకు దించాడు. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది, పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. 11.05 గంటలకు మంటలు ఆర్పారు అధికారులు. ఈ ప్రమాదంలో ఎవరికీ పెద్దగా గాయాలు కాకపోవడం గమనార్హం. అయితే ఫైర్ యాక్సిండెట్ మూలంగా ట్రాఫిక్ భారీ ఎత్తున నిలిచిపోవడంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు పోలీసులు.

# డ్యూటీకి వెళ్తూ.. హోంగార్డు గుండెపోటుతో మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:**నల్లగొండ జిల్లాలో విషాదం నెలకొంది. విధులు నిర్వహించేందుకు వెళ్తున్న హోంగార్డు గుండెపోటుతో మృతిచెందారు.నాగార్జున సాగర్ లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కిషన్ గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. వివరాల్లకి వెళితే..

ఆదివారం(జూలై13) నాగార్జున సాగర్ లోని విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ లో విధి నిర్వహిస్తున్న హోంగార్డు కిషన్ గుండెపోటుతో మృతిచెందారు. ఇంటినుంచి డ్యూటీకి వెళ్తున్న కిషన్ మార్గమధ్యలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు.గమనించిన స్థానికులు కిషన్ ను స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్ మృతిచెందారు.

ఇటీవలి కాలంలో గుండెపోటు మరణాలు, ముఖ్యంగా యువతలో కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఒకప్పుడు 60 ఏళ్లు పైబడిన వారిలో కనిపించే ఈ సమస్య ఇప్పుడు చిన్న వయసులోనే, కొన్నిసార్లు 25 ఏళ్లలోపు వారిలో కూడా వస్తోంది.

భారతదేశంలో గుండెపోటు మరణాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ముఖ్యంగా 40 ఏళ్లలోపు వారిలో ఆకస్మిక గుండెపోటు మరణాలు అధికమయ్యాయి. రిపోర్టుల ప్రకారం..ముంబైలో గడచిన నాలుగేళ్లలో అత్యధికంగా మరణాలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా గుండెపోటుతో మరణించి వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. గుండెపోటు లక్షణాలను గుర్తించడం, వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు డాక్టర్లు. ఛాతీ నొప్పి, ఊపిరి ఆడకపోవడం, వికారం, మూర్ఛగా అనిపించడం, చల్లని చెమట, అలసట, చేయి, మెడ, వీపు, దవడ, కడుపుల్లో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలంటున్నారు.

# కోట శ్రీనివాసరావు మొదటి, చివరి సినిమాలివే.. పవన్ కల్యాణ్‌తో రిలీజ్ కానీ మూవీ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:**83 ఏళ్ల వయసులో కోట శ్రీనివాసరావు మరణ వార్తతో ఇండస్ట్రీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. గత మూడేళ్లుగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన నేడు (జులై 13న) తుది శ్వాస విడిచారు. కోట సినీ ప్రస్థానం మొదలు నుంచి చివరివరకు ఎన్నో విశేషాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన నటించిన మొదటి మరియు చివరి సినిమా విశేషత సంతరించుకుంది.

కోట శ్రీనివాసరావు మొదటి సినిమా 1978లో వచ్చిన ప్రాణం ఖరీదు. చిరంజీవి మొదటి సినిమా కూడా ఇదే. ప్రాణం ఖరీదు' చిత్రంతో ఆయన తాను ఒకేసారి సినిమా కెరీర్ ప్రారంభించామని గుర్తు చేశారు కూడా చిరు.ఈ క్రమంలోనే కోట శ్రీనివాసరావు నటించిన చివరి సినిమా ఆసక్తికరంగా మారింది. కోట శ్రీనివాస రావు చివరగా పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లులో నటించారు. ఈ విషయాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కోట వెల్లడించారు. పీరియడ్ డ్రామా వీరమల్లు సినిమాలో రెండు రోజులు పాటు షూటింగ్ చేశానని కోట తెలిపారు. అంతేకాకుండా తానూ అనారోగ్యంగా ఉన్నప్పటికీ.. కేవలం పవన్ కోసమే నటించినట్లు చెప్పారు. ఇపుడీ ఈ విషయం వైరల్ అవుతుండటంతో మెగా ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.మెగా అన్నయ్యలతో కోట నటప్రస్థానం ఎప్పటికీ సుపరిచితం అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరి, ఈ సినిమాలో కోట ఎలాంటి పాత్రలో నటించనున్నారనేది ఆసక్తిగా మారింది. అయితే, హరి హర వీరమల్లు మూవీ జూలై 31న విడుదల కానుంది.

ఇకపోతే.. కోట శ్రీనివాసరావు తన 40 ఏళ్ల సినీ కెరీర్ లో తెలుగు,హిందీ, ˊన్నడ,మలయాళంలో మొత్తం750కి పైగా సినిమాల్లో నటించారు. విలన్, కమెడియన్, తండ్రిగా ఇలా ఎన్నో రకాల పాత్రలకు ఆయన జీవం పోశారు. విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన నటనకు గానూ 9 నంది అవార్డులు, ఒక సైమా అవార్డు గెలుచుకున్నారు. 2015లో కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో కోటని సత్కరించింది.

# HIVవ్యాక్సిన్ పరిశోధనకు అమెరికా నిధుల కోత..మిలియన్ల మంది ప్రాణాలకు ముప్పు?

హైదరాబాద్ పెన్ పవర్:దక్షిణాఫ్రికాలో హెచ్ఐవి HIV వ్యాక్సిన్ పరిశోధనకు అమెరికా నిధులు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. విదేశాలకు సాయం తగ్గించుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో ఈ పరిశోధనలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. HIV ప్రాజెక్టు కోసం అమెరికా కేటాయించిన 46 మిలియన్ డాలర్ల నిధులు ఆగిపోయాయి.
క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించడానికి కేవలం వారం రోజులు మాత్రమే ఉన్న సమయంలో ట్రంప్ నిర్ణయంతో HIV ప్రాజెక్టులు నిలిచిపోయాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తోంది. ఇది కేవలం పరిశోధనలను నిలిపివేయడం మాత్రమే కాకుండా, HIVవ్యాప్తి నియంత్రణలో దశాబ్దాల పురోగతిని తిప్పికొట్టి, మిలియన్ల మంది ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని ఐక్యరాజ్యసమితి HIV సహా అనేక అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.
దక్షిణాఫ్రికాలో ప్రపంచంలోనే అత్యధికంగా HIVబాధితులు ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హెచ్ఐవి బాధితులకు కోసం ఈ దేశంలో పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పరిశోధనలకు ఆ దేశంలోని జన్యు వైవిధ్యం ,పరిశోధనా నైపుణ్యం వ్యాక్సిన్ అభివృద్ధికి చాలా కీలకం. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలనలో విదేశీ సహాయాన్ని తగ్గించుకోవాలనే నిర్ణయం ఈ పరిశోధనలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. BRILLIANT ప్రాజెక్టు నిలిపివేత.. ప్రపంచ వ్యాప్తంగా HIV ని అరికట్టేందుకు ప్రారంభించిన హెచ్ ఐవీ ప్రాజెక్టు



%దీ=×ూా×ూామీ%. ట్రంప్ నిర్ణయంతో ఈ ప్రాజెక్టు క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించడానికి కేవలం వారం రోజులు మాత్రమే ఆగిపోయింది. ఈ ప్రాజెక్టు కోసం అమెరికా నుంచి కేటాయించిన 46 మిలియన్ డాలర్ల నిధులు ఆగిపోయాయి.ప్రపంచంలోనే అత్యధిక హెచ్ఐవి కేసులతో పోరాడుతున్న బాధితులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఈ నిర్ణయంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. వారి కృషి ప్రపంచానికి ప్రయోజనం చేకూరుస్తుందని భావించిన సమయంలో ట్రంప్ నిర్ణయం వారి నిరాశకు గురిచేసింది.
అమెరికా నిధుల కోతల కారణంగా సుమారు 100 మంది హెచ్ఐవి పరిశోధకులు ,8వేల మందికి పైగా ఆరోగ్య కార్యకర్తలు ఉద్యోగాలు కోల్పోయినట్లు దక్షిణాఫ్రికా ఆరోగ్య శాఖ తెలిపింది. ఇది హెచ్ఐవి రోగులకు సేవలు, డేటా సేకరణ, కౌన్సిలింగ్ అందించే సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణాఫ్రికాలో క్షయ కేసులు కూడా అధికంగానే ఉన్నాయి. ఈ నిధుల కోతలు HIV%పరిశోధనతో పాటు క్షయ పరిశోధనపైనా ప్రభావం చూపనుంది.

**నిధుల కోత ప్రపంచంపై ప్రభావం..**

అమెరికా నిధుల కోతల వల్ల కలిగే పరిణామాలు కేవలం దక్షిణాఫ్రికాకే పరిమితం కావు. ఐక్యరాజ్యసమితి (UNAIDS) అంచనాల ప్రకారం.. అమెరికా హెచ్ఐవి కార్యక్రమాలకు అందించే నిధులు భర్తీ చేయబడకపోతే 2029 నాటికి ప్రపంచవ్యాప్తంగా అదనంగా 6 మిలియన్ల కొత్త హెచ్ఐవి ఇన్ఫెక్షన్లు ,4 మిలియన్ల ఎయిడ్స్ సంబంధిత మరణాలు సంభవించవించే అవకాశం ఉంది.
హెచ్ఐవి వ్యాక్సిన్ పరిశోధన అనేది ప్రపంచవ్యాప్తంగా వ్యాధిని నియంత్రించడానికి చాలా కీలకమైంది. దీనికి ఆటంకం కలిగించడం వల్ల ప్రపంచ ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుంది.కరోనా మహమ్మారి సమయంలో వ్యాక్సిన్ అభివృద్ధికి ప్రపంచ దేశాలు ఎలా సహకరించాయో, హెచ్ఐవి వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా అదే స్థాయిలో నిబద్ధత అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
అమెరికా నిధుల కోతలతో హెచ్ఐవి పరిశోధనలకు ఇతర దాతలు,ఫార్మాస్యూటికల్ కంపెనీలు, అంతర్జాతీయ సహకారాన్ని కూడా తగ్గే అవకాశం ఉంది. హెచ్ఐవి నివారణ ,చికిత్సల్లో సాధించిన పురోగతికి నిరంతర పెట్టుబడి ,అంతర్జాతీయ సహకారం చాలా అవసరం.
ప్రపంచ ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, బిల్ గేట్స్ వంటి వ్యక్తులు ఈ నిధుల కోతలను వెనక్కి తీసుకోవాలని లేదా ఇతర దేశాలు, సంస్థలు ఆ లోటును పూరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే హెచ్ఐవి మహమ్మారిని నియంత్రించడంలో దశాబ్దాల కృషి వృధా అయ్యే ప్రమాదం ఉందంటున్నారు.

# వీడియోలు ఆలా ఉంటేనే డబ్బులు సంపాదించొచ్చు.. యూట్యూబర్స్కు కొత్త రూల్స్..




హైదరాబాద్ పెన్ పవర్:యూట్యూబ్?.. ప్రపంచంలోనే అతిపెద్ద సోషల్ మీడియా ప్లాట్?ఫాం. ఎక్కువమంది వాడుతోన్న ఈ యాప్? కేవలం ప్రపంచంలోని విషయాలను తెలుసుకోవడానికి, ఎంటర్?టైన్?మెంట్? ఇవ్వడానికి మాత్రమే కాకుండా సంపాదనకు ఒక కొత్త మార్గం చూపించింది. ఎంతోమంది యూట్యూబర్స్ కంటెంట్? క్రియేట్? చేసి పాపులారిటీతోపాటు డబ్బులు సంపాదిస్తున్నారు. కానీ, యూట్యూబ్ ద్వారా డబ్బులు సంపాదించడానికి కొన్ని రూల్స్ ఉన్నాయి. వాటిని పాటిస్తేనే ఇన్?ఫ్లుయెన్సర్లకు ఆదాయం వస్తుందన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు కొత్తగా మరికొన్ని రూల్స్ పెట్టనుంది యూట్యూబ్? ప్లాట్?ఫాం. అవేంటంటే.. ఒరిజినల్ వీడియోలకు ప్రియారిటీ ఇస్తుంది. వీడియోను కొత్తగా క్రియేట్ చేయాల్సి ఉంటుంది. కాపీ చేసిన కంటెంట్? ఎడిట్ చేసి పోస్ట్ చేయాలనుకుంటే అనుమతి ఇవ్వదు. ఒకే వీడియోను ఎక్కువసార్లు అప్?లోడ్ చేయలేరు. టెంప్లెట్, రోబోటిక్ వాయిస్?లతో చేసిన వీడియోలకు అనుమతి లేదు. తప్పుడు సమాచారం, ఎంటర్?టైన్?మెంట్ లేని వీడియోలు అనుమతించదు. ఫేస్ చూపించకుండా స్పామ్ కంటెంట్? చేస్తోన్న చానెల్స్?కు అనుమతి ఉండదు. ఇకపోతే ఏఐ జనరేటెడ్ వీడియోలు చేయొచ్చు. కానీ ఏఐ ఎఫెక్ట్ వాడొచ్చు? ఎప్పుడు ఎఫెక్ట్ పడదు అనేది ఇంకా క్లారిటీ లేదు. మొత్తానికి ఈ రూల్స్ మాత్రం ఈ నెలలో అమలు అయ్యే అవకాశం ఉంది. ఎల్లుండి (జులై 15) నుంచి కొత్త కంటెంట్?కు ప్రాధాన్యత ఇవ్వనుంది. కొత్త విషయం చెప్పే వీడియోలు, ఎడ్యుకేషన్, క్రియేటివిటీ, ఎంటర్?టైన్?మెంట్ వంటి అంశాలను మాత్రమే అనుమతిస్తుంది. కంటెంట్ స్పెషల్?గా, ఉపయోగకరంగా ఉంటేనే యూట్యూబ్ నుంచి డబ్బులు సంపాదించొచ్చు.
గూగుల్ ఏఐ మోడ్: ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లో దూసుకెళ్తోంది. ఈ క్రమంలో గూగుల్ మరో సరికొత్త టూల్ పరిచయం చేసింది. అది కూడా మనకోసం.. అవును! భారతీయ యూజర్ల కోసం గూగుల్ కొత్త ఏఐ మోడ్ టూల్? తీసుకొచ్చింది. ఈ ఏఐ మోడ్? ఇన్ సెర్చ్?ను గూగుల్ సెర్చ్? ఇంజిన్?లో కలిపేసింది. యూజర్లు అడిగిన ప్రశ్నలకు సెర్చ్ రిజల్ట్స్ డీటెయిల్డ్ ఆన్సర్స్? ఇస్తుంది. ఈ టూల్?ని ఈ ఏడాది మొదట్లో అమెరికాలో లాంచ్ చేసింది గూగుల్. తర్వాత పోయిన నెలలో సెర్చ్ ల్యాబ్స్ ద్వారా భారత్?లో కూడా అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఈ ఇంగ్లిష్ వెర్షన్?లో మాత్రమే ఉంది. ఇది ఎలా పనిచేస్తుందంటే.. ప్రశ్న ఎలా అడిగినా, కంటెంట్?ని లోతుగా విశ్లేషించి వివరణాత్మకమైన సమాధానాలు ఇస్తుంది. గూగుల్ జెమిని 2.5 మోడల్ వెర్షన్ ద్వారా ఇది పనిచేస్తుంది. అడిగిన ప్రశ్నకు వెబ్ మొత్తం సమాచారాన్ని సేకరిస్తూనే ఉప%-%ప్రశ్నలుగా డివైడ్? చేస్తుంది. తర్వాత సమాధానం ఇస్తుంది. అవసరమైన లింక్?లు, ఇతర ప్రశ్నలతో మరింత సెర్చ్ చేసేందుకు ఆప్షన్లను అందిస్తుంది. దీన్ని వాడేందుకు టెక్స్ట్ టైపింగ్ లేదా వాయిస్ ఇన్?పుట్ ఇవ్వొచ్చు. గూగుల్ లెన్స్ ద్వారా ఫొటోలను అప్?లోడ్ చేయొచ్చు. నార్మల్ సెర్చ్ రిజల్ట్స్ కంటే ఎక్కువే కంటెంట్ ఇస్తుంది. ఈ ఫీచర్ 'క్వెరీ ఫ్యాన్ అవుట్' అనే టెక్నిక్? ఆధారంగా పనిచేస్తుంది. గూగుల్ సిస్టమ్? ఒక ప్రశ్నను డివైడ్ చేస్తుంది. తద్వారా మల్టీ సెర్చ్ చేయొచ్చు.

# మీరు వెళ్ళిపోయి ఉండొచ్చు.. కానీ, మీ పాత్రలు ఎప్పటికీ బ్రతికే ఉంటాయి: ఆర్జీవీ



హైదరాబాద్ పెన్ పవర్:నటుడు కోట శ్రీనివాసరావు మృతిపట్ల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. మీరు వెళ్ళిపోయి ఉండొచ్చు కానీ, మీ పాత్రలు ఎప్పటికీ బ్రతికే ఉంటాయని ఆర్జీవీ అన్నారు. "కోట శ్రీనివాసరావు నిస్సందేహంగా సినిమా చూసిన గొప్ప నటులలో ఒకరు. నా శివ సినిమాకు ఆయన చేసిన కృషిప్రభావం అపారం. అలాగే, నా సినిమాలైనా గాయం, దబ్బు, సర్కార్ మరియు రక్తచరిత్ర.. ఇవన్నీ ఎవర్ గ్రీన్. కోటశ్రీనివాసరావు గారు, మీరు వెళ్ళిపోయి ఉండవచ్చు కానీ మీ పాత్రలు ఎప్పటికీ బ్రతికే ఉంటాయని"డైరెక్టర్ ఆర్జీవీ %X%లో పోస్ట్ పెట్టాడు.ఇకపోతే.. ఆర్జీవీ డైరెక్ట్ చేసిన అనేక సినిమాల్లో కోట శ్రీనివాసరావు నటించారు. వాటిలో శివ (1989), గాయం (1993),మనీ (1993),గోవిందా గోవిందా (1994),అనగనగా ఒక రోజు (1995),సర్కార్ (2005), రక్త చరిత్ర (2010) వంటి తదితర సినిమాలకు పనిచేశాడు.గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాసరావు (జులై 13న) తుది శ్వాస విడిచారు. ఈ క్రమంలో సినీ,రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1978 ప్రాణం ఖరీదు సినిమాతో సినీ ఎంట్రీ ఇచ్చిన కోట.. దాదాపు 750 సినిమాలకు పైగా నటించారు.

# వ్యాపారిపై మూకదాడి.. కాంక్రీట్ ముక్కలతో కొట్టి చంపి శవంపై డ్యాన్స్.. అట్టుడుకుతున్న బంగ్లా !

**హైదరాబాద్ పెన్ పవర్:**మైనారిటీ సంఘాలు, విద్యార్థులు, మానవ హక్కుల నేతల నిరసనలతో హోరెత్తుతోంది బంగ్లాదేశ్. స్క్రాప్ వ్యాపారిని దారుణాతి దారుణంగా చిత్ర హింసలు పెట్టి చంపడంపై ప్రజలు భగ్గుమన్నారు. రోడ్లపైకెక్కి నిరసనలు తెలియజేస్తున్నారు. యూనుస్ ప్రభుత్వ అసమర్థతపై దుమ్మెత్తి పోస్తున్నారు. “అమాయక చిరు వ్యాపారిని చంపే హక్కు మీకెవరిచ్చారు” అంటూ నినాదాలు చేస్తున్నారు. స్క్రాప్ వ్యాపారిపై మూక దాడికి సంబంధించిన వీడియో బంగ్లాదేశ్ లో వైరల్ గా మారింది. స్లాప్ కాంక్రీట్ రాళ్లతో అతి కిరాతకంగా దాడి చేయడంతో లాల్ చంద్ సొహాగ్ అనే స్క్రాప్ వ్యాపారి చనిపోయాడు. ఆ తర్వాత శవంపై ఎక్కి చాలా రాక్షసానందంతో డ్యాన్సులు చేశారు దుండగులు.

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో 2025, జూలై 9 (బుధవారం) న సర్ సలీముల్లా మెడికల్ కాలేజ్ మిట్ఫోర్డ్ ఆసుపత్రి ముందు ఎదుట జరిగింది ఈ మూకదాడి హత్య. ఈ వీడియో ఆలస్యంగా వెలుగులోకి రావటంతో బంగ్లాదేశ్ లో ఉన్న మైనారిటీ






సంఘాలు భగ్గుమన్నాయి. హిందూ సంఘాలతో పాటు విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు రాజధాని ఢాకాలో భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

లాల్ దారుణ హత్యకు సంబంధించిన వీడియో వైరల్ అయిన వెంటనే ఢాకా యూనివర్సిటీ, జగన్నాథ్ విద్యార్థులు భారీగా నిరసనలకు దిగారు. %దీ=ూజ, చీూఖ%, ఈస్ట్ వెస్ట్ యూనివర్సిటీతో పాటు ప్రభుత్వ ఆధీనంలో నడిచే ఈడెన్ కాలేజ్ వంటి ప్రైవేట్ యూనివర్సిటీ విద్యార్థులు కూడా శనివారం (జులై 12) ఆందోళనలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి కొత్వాలీ పోలీస్ స్టేషన్ లో 19 మంది నిందితులపై కేసు మర్డర్ కేసు నమోదైంది. వీరితో పాటు మరో 15 నుంచి 20 మందిపైనా కేసులు పెట్టారు పోలీసులు. అయితే స్క్రాప్ డీలర్ హత్య వెనుక బంగ్లా దేశ్ నేషనలిస్ట్ పార్టీ యూత్ వింగ్ నాయకులు ఉన్నట్లు BDNews24 పేర్కొంది. మూకదాడి ఆరోపణలు ఉన్న ఐదు మందిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ ప్రకటించింది.

ఆగస్టు 2024 నుండి, బంగ్లాదేశ్‌లో గత ప్రధాని షేక్ హసీనా 16 ఏండ్ల పాలనను కూల్చేసి యూనుస్ ఆధ్వర్యంలో మధ్యంతర ప్రభుత్వ ఏర్పడిన తర్వాత మూక హత్యలు పెరుగుతూ వస్తున్నాయి. జూలై 10న, బంగ్లాదేశ్ హిందూ బౌద్ధ క్రైస్తవ యూనిటీ కౌన్సిల్ నివేదించిన ప్రకారం, 2024 ఆగస్టు 4 నుంచి 330 రోజులలో మైనారిటీ వర్గాలపై 2,442 మత సంబంధిత హింసాత్మక ఘటనలు జరిగాయి. లేటెస్ట్ గా స్క్రాప్ డీలర్ పై మూకదాడి జరగటం.. చనిపోవడంతో మరోసారి బంగ్లాదేశ్ మైనారిటీలు ఆందోళన బాట పట్టారు.

# ఆధ్యాత్మికం: మోక్షం ఎలా పొందాలి.. శ్రీకృష్ణుడు చూపిన మార్గం ఇదే..!

**హైదరాబాద్ పెన్ పవర్:**హిందువులు అందరూ పూజలు చేస్తుంటారు. కొంతమంది ఎన్ని పూజలు చేసినా కలసి రాదు. దీని ప్రకారం ఆలోచిస్తే గత జన్మలో చేసిన పాప.. పుణ్యాల వలన ఈ జన్మలో కర్మ ఫలాన్ని జీవితం కొనసాగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరు మోక్షం పొందేందుకు పూజలు .. పునస్కారాలు చేస్తుంటారు. అసలు మోక్షం అంటే ఏమిటి..? దానిని ఎలా పొందాలి.. ఈ విషయంలో శ్రీకృష్ణుడు ఏం చెప్పాడో ఈ స్టోరీలో తెలుసుకుందాం...!




ఏదో ఒక కర్మ చెయ్యకుండా ఏ ప్రాణీ ఉండలేదు. మంచి పనులు చేస్తే కీర్తి ప్రతిష్టలు, స్వర్గసుఖాలు, పుణ్యఫలాలు వస్తాయి. చెడ్డపనులు చేస్తే సంఘంలో చెడ్డపేరు, నరకయాతనలు, పాపఫలాలు వస్తాయి. ఇలా పాపపుణ్యాలు చేస్తూ, స్వర్గము.. నరకం అనుభవిస్తూ... మరల మరల జన్మలెత్తుతుంటారు. ఈ జనన... మరణ సంసారచక్రంలో ఉండిపోవలసిందేనా? లేక మోక్షం పొందడం ఉందా? అని మనం విచారించడం సహజం. మనలోని ఈ విచారాన్ని దూరం చేయడానికే గీతలో శ్రీకృష్ణ భగవానుడు చక్కని మార్గం చూపాడు.

**యత్కరోషి, యదశ్నాసి, యజ్జుహొషి దదాసియత్**

**యత్తపస్యసి, కౌంతేయ! తత్కురుష్వమదర్పణమ్**

తా” అర్జునా! నువ్వేపని చేసినా, ఏమి తిన్నా, ఏ హోమం చేసినా, అదంతా నాకు సమర్పించు.అయితే ఈ సలహా పాటిస్తే మనకు వచ్చే లాభం ఏమిటి? ఇలా చేస్తే, మనం మూడు త్యాగాలు చేసినట్లవుతుందని పురాణాలు చెబుతున్నాయి. మొదటిది కర్తృత్వ త్యాగం. ఈ పని నేనే చేస్తున్నాను లేదా చేయిస్తున్నాననే అహంకారం వదలాలి. ఏ కర్మయినా ఆ భగవంతుడే చేయిస్తున్నాడని భావించాలి. ఏం చేసినా భగవత్పరంగా చెయ్యాలి. ఇలా చేస్తే, మనం పాపపు పనులు చేయడానికి జంకుతాము. కర్మసాక్షి అయిన భగవానుణ్ణి తలుచుకుంటూ సదా సత్కార్యాలకు పూనుకుంటాము.

రెండవది ఫలత్యాగం. ఏం చేసినా ఇది నా కర్తవ్యం అని చెయ్యాలి. అంతేగాని ఇది చేస్తే నాకీ ఫలం వస్తుంది అని కోరికతో చెయ్యవద్దు. నేనేం చేసినా దాని ఫలం భగవానుడిదే అన్నీ భగవత్ కైంకర్య రూపాలే అని నమ్మాలి.

మూడోది సంగత్యాగం. ఇది నాది... ఇది నేనే చెయ్యాలి. అంతా నా ఇష్టప్రకారం జరగాలి. ఇది నా ఆనందం కోసం అని బంధం పెంచుకోవద్దు. అంతా భగవన్ముఖ వికాసం కోసం, ఆయన ఆనందమే నాఆనందం అని మనస్ఫూర్తిగా అనుకోవాలి.

పురాణాల ప్రకారం కనపడే శరీరం పోయినా ఈ సూక్ష్మశరీరం ఉంటుంది. అదే పైలోకాలకు తిరిగేది . స్వర్గం... నరకం అనుభవించేది కూడా ఆత్మే. ప్రకృతి... ఆత్మ తప్ప మిగిలినదంతా ప్రకృతియే. మనస్సు, ఇంద్రియాలు, శరీరం, కంపడే అంతా ప్రకృతియే. ప్రకృతినే ప్రధానము, అవ్యక్తము, మాయ అనే పేర్లున్నాయి.మట్టియే కుండగా మార్పుచెందినట్లు ప్రకృతే ఈ జగత్తుగా మారుతుంది. ధర్మంగా జీవించాలని.. ధర్మబద్ధమైన పనులను చేయాలని అప్పుడే మోక్షం కలుగుతుందని శ్రీకృష్ణుడు చెప్పాడు.

జ్ఞానం కలిగి మోక్షం సిద్ధించేంత వరకు ఎన్ని జన్మలైనా కలుగుతూనే ఉంటాయి. ఆ జన్మలు ఇన్ని, ఇవి అని చెప్పడం సాధ్యం కాదు.రానున్న జన్మలు ఏ రూపంలో ఉంటాయో కూడా చెప్పలేం.. ఇప్పటి వరకు అనుభవించిన జన్మల పాప.. పుణ్యాల వలన ఎలా జన్మించాలో భగవంతుడు నిర్దేశిస్తాడు.. జంతువు కావచ్చు.. చెట్టు కావచ్చు.. క్రిములు కావచ్చు.. ఏ రూపం అనేది మాత్రం చెప్పలేము. ప్రస్తుత జన్మలో మనం చేసుకున్న కర్మఫలితంగా వచ్చే జన్మ ఆధారపడి ఉంటుంది.

ధర్మబద్ధంగా అంటే.. ఒకరిని అన్యాయం చేయకుండా.. డబ్బులు సంపాదించి... దానితో ధర్మబద్ధమైన కోరికలు తీర్చుకొని... తద్వారా మోక్షం పొందుమని దీని అర్థం. ధర్మస్వరూపాన్ని తెలుసుకుని మంచి ప్రవర్తనతో... ధర్మాన్ని రక్షించాలి. సత్ప్రవర్తనతో ధర్మాన్ని రక్షించి మోక్షాన్ని పొందాలని శ్రీకృష్ణుడు మోక్షం గురించి వివరించాడని భాగవతంలో చెప్పబడింది.

## నేనొచ్చేసరికి నా కోటన్న వెళ్లిపోయాడు.. కన్నీటి పర్యంతమైన బాబూమోహన్



**హైదరాబాద్ పెన్ పవర్:**నటుడు కోట శ్రీనివాసరావు మృతిపట్ల సినీ ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. ఈ క్రమంలో కోట భౌతిక కాయాన్ని సందర్శించిన బాబూ మోహన్ తమ అన్నదమ్ముల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు.“ఈ రోజు చాలా దురదృష్టకరమైన రోజు. రెండు రాష్ట్రాల ప్రజలకంటే నాకే ఎక్కువ ఆత్మీయుడు కోటన్న. మేమిద్దరం సినిమాల్లోనే కాదు, బయట కూడా సరదాగా ఉండేవాళ్లం. సెటైర్లు వేస్తూ మాట్లాడుకునేవాళ్ళం. రెండు రోజుల కిందటే ఇద్దరం మాట్లాడుకున్నాం. ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పా. నేనొచ్చేసరికి ఆయన లేడు. నా కోటన్న వెళ్లిపోయాడు.

ఇంటికొస్తే ఎంతో సంతోషంగా, ఆప్యాయంగా మాట్లాడేవాడు. ఆయనకు అన్నదమ్ములున్నా, నన్నే తన సొంత తమ్ముడిగా భావించేవాడు. ఎన్నోసార్లు ఒకే ప్లేట్లో భోజనం చేశాం. నాకు ముద్దలు కలిపి పెట్టేవాడు. ఏ ఊరుకు షూటింగ్‌కు వెళ్లినా, పక్కపక్క గదుల్లోనే ఉండేవాళ్లం. ఇలా మా జీవితంలో ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కోటన్న ఆత్మకు శాంతి చేకూరాలని ”ఆశిస్తున్నాని చెబుతూ బాబూ మోహన్ కన్నీటి పర్యంతమయ్యారు.కోట, బాబూ మోహన్‌లది హిట్ కాంబినేషన్. ఇద్దరూ కలిసి నటిస్తే ఆ సినిమా హిట్టు అన్నంతగా క్లిక్ అయిన కాంబో ఇది. నిజానికి మొదట వీళ్లిద్దరినీ కలిపింది ముత్యాల సుబ్బయ్య. ‘మామగారు’ మూవీలో వీళ్లిద్దరినీ కలిపి ఒక ట్రాక్ పెట్టారాయన. సినిమా సక్సెస్ కావడానికి ఆ రెండు పాత్రలూ కూడా కారణం కావడంతో.. అప్పటి నుంచి వీళ్లిద్దరినీ కలిపే కథలు రాసుకునేవారు దర్శకులు. యాభై సినిమాల్లో అలా కలిసి నటించడంతో బైట కూడా ఆత్మీయులుగా మారిపోయారు కోట, బాబూ మోహన్.

# తెలుగు నటదిగ్గజాల వరుసలో విలక్షణ కోట.. ఆ పాత్రలు మరొకరు చేయలేరేమో!

**హైదరాబాద్ పెన్ పవర్:**కడుపుబ్బ నవ్వించగలడు. కళ్లనిండా నీరు తెప్పించగలడు. సౌమ్యంగా మనసును స్పృశించగలడు. క్రూరంగా కంగారుపెట్టనూ గలడు. ఎంత పెద్ద పాత్రనైనా అవలీలగా పండించగలడు. ఎంత చిన్న పాత్రకైనా తన నటనా పటిమతో కొండంత గౌరవాన్ని తెచ్చిపెట్టగలడు. ఆ మేటి నటుడు ఎవరో కాదు.. కోట శ్రీనివాసరావు గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం (2025 జూలై 13న) తెల్లవారుజామున ఫిల్మ్‌నగర్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలో తాను పోషించిన పాత్రల వైవిధ్యాన్ని గుర్తుచేసుకుంటూ..



నటుడు కోట శ్రీనివాసరావు ఓ నటనా శిఖరం. కోట తన నటనలో వైవిధ్యం చూపించేవారు. పాత్ర ఏదైనా సరే అందులో లీనమైపోయేవారు. ఆయన పాత్రకు తగ్గట్టుగా తన రూపాన్ని, హావభావాలను మార్చుకోవడంలో దిట్ట. కోట విలన్ పాత్రలతో పాటు హాస్య పాత్రలలో కూడా తనదైన శైలిని చూపించారు. ఆయన డైలాగులు చెప్పే విధానం చాలా ప్రత్యేకం, 'ఈ డెవడ్రా బాబూ...' 'నాకేంటి ..మరి నాకేంటి' వంటి ఆయన డైలాగులను ప్రేక్షకులు తెగ ఇష్టపడతారు. అలా తాము పోషించిన పాత్రలో ఇమిడిపోగల అతికొద్ది మంది నటుల్లో కోట శ్రీనివాసరావు ఒకరు.

వందేళ్ల తెలుగు సినీ ప్రస్థానంలో ఒక ఎస్వీ రంగారావు, రావు గోపాలరావు, కైకాల సత్యనారాయణ వంటి నటదిగ్గజాల తర్వాత కోట అని చెప్పొచ్చు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా, హాస్యనటుడిగా ఆయన ఎన్నో విభిన్న పాత్రలు పోషించారు. ఆయన నటించిన సినిమాల్లోని కొన్ని పాత్రలను చూస్తే, కోట శ్రీనివాసరావు తప్ప మరొకరు ఆ పాత్రలను చేయలేరేమో అనిపిస్తుంది.

అలా కోట శ్రీనివాసరావు ఎన్నో గొప్ప సినిమాలలో నటించి మెప్పించారు. అలాంటి ఎవర్ గ్రీన్ సినిమాల్లో 'అహ నా పెళ్ళంట'లోని పిసినారి లక్ష్మీపతి పాత్ర ఒకటి. ప్రతిఘటన సినిమాలో యాదగిరి, గణేష్ లో సాంబశివుడు, గాయం మూవీలో గురు నారాయణ్, ఆమ్మో ఒకటో తారీఖు సినిమాలో ఎల్. బి. శ్రీరాం తండ్రిగా ఆంజనేయులుగా పాత్ర, మామగారు సినిమాలో పోతురాజుగా కోట నటించగా బిచ్చగాడిగా బాబు మోహన్, ఆ నలుగురులో డబ్బు అప్పిచ్చే కోటయ్య వంటి ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకుల్లో సుస్థిర స్థానం కైవసం చేసుకున్నాడు కోట.

అలాగే ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు సినిమాలో వెంకటేష్ తండ్రిగా కామెడీ, భావోద్వేగ పాత్రల్లో మెప్పించాడు. ఆడవారి మాటలకూ అర్థాలే వేరులే సినిమాలో సైతం వెంకటేష్ కు నాన్నగా నటించి గుర్తిండిపోయాడు. రాఖీ సినిమాలో ఎన్టీఆర్ తాతగా నటించి ఎమోషనల్ పండించాడు. ఇలా తన సినీ ప్రస్థానంలో ఎన్నో భిన్నమైన పాత్రలు పోషించి సినీ ప్రియులను అలరించారు. సుమారు 40ఏళ్ల పాటు సినీ, నాటక రంగాల్లో కోటా ఎంతో సేవచేశారు. ఆయన నటనకు గుర్తింపుగా ఎన్ని ప్రతిష్టాత్మక గుర్తింపులు లభించాయి. ఆయన అత్యధిక నంది పురస్కారాలు అందుకున్న వారిలో మొదటిస్థానంలో ఉంటాడు. ప్రతిఘటన(1985), గాయం (1993), తీర్పు (1994), లిటిల్ సోల్జర్స్(1996), గణేష్ (1998), చిన్న (2000), పెళ్లైన కొత్తలో (2006), ఆ నలుగురు (2004), పృథ్వీ నారాయణ(2002) చిత్రాలకు 9 నంది అవార్డులు అందుకున్నారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

**కోటా నటించిన వాటిలో కొన్ని ముఖ్యమైన సినిమాలు చూసుకుంటే:**

1978లో చిరంజీవి 'ప్రాణం ఖరీదు'తో సినీ ఎంట్రీ ఇచ్చాడు. కోటా 4 దశాబ్దాల సినీ ప్రయాణంలో 750కి పైగా చిత్రాల్లో నటించారు.

రేపాటి పౌరులు (1986),ప్రతిఘటన (1986), అహ నా పెళ్లంట (1987), శివ (1989), శత్రువు (1990), డబ్బు (1993), గాయం (1993), గోవింద గోవింద (1993), తీర్పు (1994), హలో బ్రదర్ (1994), ఆమె (1994), లిటిల్ సోల్జర్స్ (1996), అనగనగా ఒక రోజు (1997), గణేష్ (1998), చిన్నా (2000), పృథ్వీ నారాయణ (2002), ఇడియట్ (2002), మల్లీశ్వరి (2004), ఆ నలుగురు (2004), అతడు (2005), ఛత్రపతి (2005), బొమ్మరిల్లు (2006), సర్కార్ (2006), పెళ్లైన కొత్తలో (2006), రెడీ (2008), లీడర్ (2010), రక్త చరిత్ర (2010), అత్తారింటికి దారేది (2013), %యా/రా% సత్యమూర్తి (2015), హీరో (2022) వంటి చిత్రాలలో తన విభిన్న పాత్రలకు విస్తృత విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. 2003లో, అతను సామి మూవీతో తమిళ పరిశ్రమలో విలన్‌గా అరంగేట్రం చేశాడు.

# కోట సినీ పరిశ్రమకు ఒక డిక్షనరీ.. నేటి తరం నటులు ఆయన పుస్తకాన్ని చదవాల్సిందే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు (83) కన్నుమూశారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ( జులై 13) తెల్లవారుజామున ఫిలింనగర్ లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. సినీ రంగంలో ఎస్వీ రంగారావు, కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావుల శకం ముగిసిన తర్వాత ఆ లోటును కోట శ్రీనివాసరావు భర్తీ చేశారు. కోట సినీ ప్రపంచంలో తనదైన ముద్రను చాటుకున్నారు.

కోట సినీ పరిశ్రమలో ఓ పేజి రాసుకుని వెళ్ళలేదు...అతనో డిక్షనరీ... పాత్ర కావాలన్నా ...కోట పుస్తకంలోకి తొంగి చూడాల్సిందే.. జీవిత వాస్తవ పాత్రలెన్నో తనను కోరికోరి వరించి గర్వపడినవే. జంధ్యాల సినిమాలో ఈ పిసినారి లక్ష్మీపతి..నిజ జీవితంలో ఎన్నో గుప్త దాన ధర్మాలు చేసిన వితరణ శీలి..తరతరాలకు తరగని మాన్యం కోట శ్రీనివాసరావు.సినీలోకంలో మరో దిగ్గజం నింగికెగసింది–. నవరసాలు తన నటన లో పలికించి పాత్రలెన్నిటిలోనో జీవించిన మండలాధీసుడు సినీపరిశ్రమలో కీర్తికిరిటం ... విశ్వరూపంలా భయపెట్టి బెంబేలెత్తించే రౌద్రరూపం నేడు చిన్నబోయింది. వెన్నులో వణుకు పుట్టించే భయానక రసం మెండుగా పోషించిన వెండి తెర విలనిజం నటుడు కోట శ్రీనివాసరావు.

అందరిని నవ్వించే హాస్యం నేడు కన్నీరు పెడుతున్నది. వెండి తెరపై గుండెలను పిండేసే కరుణామూర్తిగా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తి అద్భుతంగా నవరసాలు పలికించాడు స్వర్గీయ కోట శ్రీనివాసరావు. నిండుగా గంభీరంగా కనిపిస్తూ ..నాలుగు దశాబ్దాలు పాటు సినీ రంగాన్ని ఏలిన స్వయంకృషీవలుడు.. మహోన్నత నటుడు కోటన్న...సినీ రంగంలో కోట శ్రీనివాసరావు అమాయకంగా నవ్వటం తెలిసిన మహాభోగి...అతను చెయ్యని పాత్రలేదు... ఆయనకు చేతకాని నటనే లేదని నిరూపించిన ... నటన లేదు... అద్భుతాలు పండించిన విలక్షణ నటుడు ఇక లేరనే వార్తను సినీ ప్రపంచం జీర్ణించుకోలేకపోతుంది.

దక్షిణాది ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న .. విలనిజంలో నవరస సార్వభౌముడు.. లబ్ధప్రతిష్టుడు ..ఎన్నో...ఎన్నెన్నో పాత్రలలో సజీవుడైన మన కోట శ్రీనివాసరావు సినీరంగంలో లెజెండరీ కళాకారుడు అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదేమో మరి..! సినీ రంగంలో ప్రత్యామ్నాయం లేని మహా నటుడుకోట శ్రీనివాసరావు గారికి యావత్? టాలీవుడ్? ప్రపంచం.. తెలుగునాటి రాజకీయ ప్రముఖులు బాధ తప్త హృదయంతో అశ్రు నివాళులు తెలుపుతున్నారు.

## కోట భౌతికకాయాన్ని చూసి కన్నీటి పర్యంతమైన బ్రహ్మానందం.. ఓదార్చిన రాజేంద్రప్రసాద్!

- ఆదివారం ఉదయం కన్నుమూసిన కోట శ్రీనివాసరావు
- కోట నివాసానికి వెళ్లిన బ్రహ్మానందం
- కోట భౌతికకాయాన్ని చూసి తీవ్ర భావోద్వేగాలకు లోనైన వైనం





**హైదరాబాద్ పెన్ పవర్:**ఎన్నో విజయవంతమైన చిత్రాలలో తనతో కలిసి నవ్వులు విరబూయించిన కోట శ్రీనివాసరావు విగతజీవుడిలా ఉండడం చూసి ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం తట్టుకోలేకపోయారు. కోట భౌతికకాయాన్ని ఉంచిన బాక్సుపై తల ఆనించి కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ ఉదయం కోట శ్రీనివాసరావు జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో, బ్రహ్మానందం తన చిరకాల మిత్రుడు కోట ఇంటికి వచ్చారు. కోట భౌతికకాయాన్ని చూడగానే ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగాలకు లోనై రెండు చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ బ్రహ్మానందాన్ని ఓదార్చారు.

# సోషల్ మీడియా.. అదో మాయ : అసలు సొసైటీలో ఎందుకు ఇలా జరుగుతోంది ?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఒక్కో రీల్, వీడియో చూస్తుంటే.. 'అందరూ ఎంత సంతోషంగా ఉన్నారో' అనిపిస్తుంటుంది. కానీ 'మెరిసేదంతా బంగారం కాదు'.. సోషల్? మీడియాలో మనం చూసేదంతా నిజమూ కాదు అని గుర్తుంచుకోవాలి. చాలామంది పైకి బాగా కనపడినా వాళ్ల మనసు లోతుల్లో ఏదో తెలియని నిజం దాగి ఉంటుంది. వాళ్లకు మాత్రమే తెలిసిన ఆ నిజాన్ని ఎవరితో చెప్పుకోవాలో తెలియక సతమతమవుతుంటారు. అలాంటప్పుడు 'మిమ్మల్ని మేం అర్థం చేసుకుంటాం' అంటున్నారు మానసిక నిపుణులు. ప్రస్తుతం పరిస్థితుల్లో సోషల్ మీడియా ఇన్?ఫ్లుయెన్స్? ఎంత తీవ్రంగా ఉందో చెప్తూనే.. దానికి పరిష్కారమూ ఉందంటున్నారు సైకాలజిస్ట్? సోఫీ మ్యాథ్యూ.



ప్రస్తుతం ఎక్కడ చూసినా క్రైమ్ వార్తలే. సోషల్ మీడియా వచ్చినప్పటి నుంచి క్రైమ్ రేట్ రోజురోజుకీ పెరిగిపోతోంది. వాస్తవానికి సమాజంలో క్రైమ్? పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స్ కూడా ఒకటి. ఆల్రెడీ చాలామంది ఎమోషనల్ బ్యాలెన్స్ లేక, ఒత్తిడితో బాధపడుతుంటారు. అలాంటివాళ్లు డిజిటల్ ప్లాట్ఫాంకి అలవాటైతే వాళ్ల బిహేవియర్?లో మార్పు వచ్చేస్తుంది. దాంతో విపరీతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. అసలు సొసైటీలో ఎందుకు ఇలా జరుగుతోంది? అని పరిశీలిస్తే... సోషల్ మీడియా.. అదో మాయ: ప్రస్తుతం పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ డిజిటల్ ఫ్లాట్?ఫాంకి అలవాటైపోయారు. దాంతో వాళ్ల బిహేవియర్?లోనూ మార్పులు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో ఎంటర్టైన్మెంట్?తోపాటు ఇతర విషయాలు కూడా ఉంటాయి. వాటిలో ఇతరులకు హానిచేసేలా ప్రేరేపించే కంటెంట్ ఉండొచ్చు. అవన్నీ చూస్తున్నప్పుడు మెల్లగా మైండ్ చేంజ్ అవుతూ ఉంటుంది. అది చెడు అని తెలిసినప్పటికీ అవి ఇంట్రెస్టింగ్?గా ఉండడంతో కంటిన్యూ చేస్తారు. ఏ డిజిటల్ ప్లాట్?ఫాం అయినా యూజర్?కు నచ్చే కంటెంట్?నే రెకమెండ్ చేస్తూ ఉంటుంది. అలాంటి వీడియోలే తరచూ కనిపిస్తుంటాయి. అవి చూస్తూ ఒక రకమైన మైకంలో పడిపోతుంటారు. ఉదాహరణకు ఇద్దరు మనుషులు తిట్టుకోవడం, కొట్టుకోవడం వంటి అంశాలతో వీడియో చేసి, థంబ్?నెయిల్?లో కూడా అట్రాక్ట్ చేసేలా.. టైటిల్స్ పెడుతుంటారు. దానికి తగ్గట్టే ఫొటోలు ఎడిట్ చేస్తారు. సాధారణంగా కాసేపు కాలక్షేపానికో, కొత్త విషయం తెలుసుకోవడానికో ఒక సోషల్ మీడియా ప్లాట్? ఫాం ఓపెన్ చేస్తారు. అంతే... ఓపెన్ కాగానే రకరకాల కంటెంట్తో ఫొటోలు, వీడియోలు అట్రాక్ట్ చేస్తుంటాయి. దాంతో కొన్నిసార్లు అసలు విషయం మర్చిపోయి కనిపించిన వీడియోలన్నీ చూస్తూ ఎంటర్?టైన్ అవుతూ టైం కూడా మర్చిపోతుంటారు. అలాంటి వీడియోలను షేర్ కూడా చేస్తుంటారు. అలా అవి వైరల్ అవుతుంటాయి. అలాంటి కంటెంట్కి బాగా ఇన్ఫ్లుయెన్స్ అవుతున్నారు.

**డిజిటల్ అగ్రెషన్?:** ఇప్పుడు సొసైటీలో జరిగే ఎన్నో విషయాలకు సోషల్ మీడియా కూడా ముఖ్య కారణం అవుతోంది. అందులో మంచీ.. చెడూ తేడా లేకుండా వైరల్ అవుతోంది. ఒకరు మంచి మెసేజ్ ఇచ్చే వీడియో చేస్తే.. అది చూసి నలుగురు ఇన్?స్పైర్ అవ్వడం మంచి విషయం. కానీ, అదే ఒక క్రైమ్?ని ప్రోత్సహించే వీడియో చూసి దాన్ని ఇన్?స్పైర్ అయితే..? ఇప్పుడు మీడియాలో వస్తోన్న క్రైమ్? న్యూస్?లో ఎక్కువశాతం కేసులు ఇవే ఉన్నాయి. సోషల్ మీడియాలోనో, ఓటీటీ, సినిమాలు.. వంటి మాధ్యమాలలో కనిపించే క్రైమ్?ని నిజజీవితంలో అన్వయిస్తున్నారు. ముఖ్యంగా యూత్..? ఇప్పుడు జరుగుతున్న క్రైమ్స్?లో వాళ్లే ఎక్కువ ఉన్నారు. వీళ్లంతా డిజిటల్ అగ్రెషన్?కు గురైనవాళ్లు. డిజిటల్ ప్లాట్?ఫామ్స్?లో చూసిన క్రైమ్?కి ప్రభావితం అయి, అవే ఆలోచనలతో ఉంటారు. అవకాశం రాగానే వాళ్లలో ఉన్న అగ్రెషన్?ని బయటకు తీస్తారు.

**టాక్సిక్ రోల్ మోడల్:** థియేటర్?లో సినిమాలు, ఓటీటీలో వెబ్? సిరీస్?లు, సోషల్ మీడియాలో వీడియోలు.. ప్లాట్?ఫామ్స్ ఎలాగైతే వేర్వేరుగా ఉన్నాయో.. అలానే వాటిని చూసేవాళ్లంతా ఒకే ఉద్దేశంతో లేరు. కొందరు ఎంటర్?టైన్?మెంట్ కోసం చూస్తే, మరికొందరు ఏదైనా మెసేజ్? లేదా ఒక స్టోరీ చూడాలనే ఆసక్తితో ఉంటారు. సోషల్ మీడియాలో అయితే ఎప్పుడూ ఏదో కొత్త విషయం ఉంటుంది కాబట్టి పదే పదే ఆ ప్లాట్?ఫామ్స్?కి వెళ్తుంటారు. అయితే కొందరు వాటిలోని క్యారెక్టర్స్?కి ప్రభావితం అవుతుంటారు. మంచి క్యారెక్టర్? అయితే ఇన్?స్పైర్ అవ్వడం మంచిదే. కానీ మరోవైపు చూస్తే పరిస్థితి వేరేలా ఉంది. ఇప్పుడు సొసైటీలో చాలామంది క్రైమ్ ఎలిమెంట్స్?కు అంటే.. సీరియల్స్, సినిమాలు లేదా సిరీస్?ల్లో క్రైమ్? సీన్స్, విలన్ పాత్రలకు కనెక్ట్ అవుతున్నారు. వాటిలో రక్తపాతం, ఫైట్స్, గొడవలు, ద్వేషం.. వంటివాటిని గొప్ప విషయంగా చూపించడంతో ఆటోమెటిక్?గా ఇన్?ఫ్లుయెన్స్ అయిపోతున్నారు. అదంతా చాలా నార్మల్? అని, అలా చేస్తే మనల్ని కూడా గొప్పవాళ్లుగా చూస్తారని అనుకుంటున్నారు. ఆ పాత్రలను రోల్ మోడల్?గా తీసుకుని వాళ్లలా బిహేవ్ చేయాలి అనుకుంటున్నారు. మరికొందరు వాళ్లలోని ఎమోషన్స్?ని బయటకు చూపించలేక డిజిటల్ ప్లాట్?ఫాంలో క్రైమ్ చూసి, విలన్ పాత్రల్లో వాళ్లను ఊహించుకుని మానసిక సంతృప్తి పొందుతుంటారు. ఎందుకంటే వాళ్లకు ఎలా ఎక్స్?ప్రెస్ చేయాలో తెలియదు. సోషల్ మీడియాలో కూడా కొంతమంది వాళ్ల ఫేస్ చూపించకుండా చెడును పెంచే కంటెంట్ చేస్తుంటారు. పాపులారిటీకి ఇచ్చే ఇంపార్టెన్స్ మొరాలిటీకి ఇవ్వట్లేదు.

**సోషల్ కంపారిజన్ :** సోషల్ కంపారిజన్.. వీడియోల్లో రిలేషన్?షిప్, పేరెంట్స్, ఫ్యామిలీ.. ఏది చూసినా ప్రతి ఒక్కరూ నూటికినూరు శాతం ఆనందంగా ఉన్నట్టు చూపించుకుంటున్నారు. రియల్? లైఫ్?లో మాత్రం అలా ఉండేవాళ్లను వేళ్లపై లెక్కించొచ్చు. కానీ వాళ్లను చూసి వ్యూయర్స్.."వాళ్లంతా హ్యాపీగా ఉన్నారు. మన లైఫ్?లో హ్యాపీనెస్ లేదు" అని వాళ్లలో వాళ్లు ఫీలయిపోతున్నారు. వాళ్ల నిజజీవితంలో ఎలా ఉందో వీళ్లకు తెలియదు. వాళ్లు చెప్పేదాంట్లో ఎంత నిజం ఉందో గ్రహించట్లేదు. మన ఇంట్లో వాళ్లు మనల్ని ఎలా చూస్తున్నారో అనేది పక్కన పెట్టి.. ఇతరులతో పోల్చుకోవడం కరెక్ట్ కాదు. కొన్నిసార్లు అంతా బాగానే ఉన్నా వాళ్లను వాళ్లే తక్కువ చేసుకుంటారు. మనసులో ఏదో పెట్టుకుని మథనపడిపోతుంటారు. ఎవరికీ చెప్పుకోలేని మానసిక వేదన అనుభవిస్తుంటారు.

**ఎమోషనల్ బ్యాలెన్స్:** ఇప్పుడున్న పరిస్థితుల్లో మనుషుల ఆలోచనల్లో కూడా తేడా వచ్చింది. ఇతరుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ మాత్రమే కోరుకుంటున్నారు. అలా వస్తే హ్యాపీగా రిసీవ్ చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే లైక్స్, వ్యూస్?ని బట్టి వాళ్లు 'ఎంత గ్రేట్?, టాలెంటెడ్' అనే వ్యాలిడిటీ ఇచ్చుకుంటారు. పైగా వీళ్లకు ఎక్స్?పెక్టేషన్స్ కూడా ఎక్కువ ఉంటాయి. వీళ్లు ఊహించినదానికి భిన్నంగా రెస్పాన్స్ వస్తే అస్సలు తట్టుకోలేరు. ప్రతిదానికీ రియాక్ట్ అవ్వాలనుకుంటారు. అందుకే సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్, ట్రోల్స్?కు చాలామంది వెంటనే రివర్స్ అవుతుంటారు. అవతలి వాళ్లను ఏదో ఒకటి అనేంతవరకు వాళ్లకు నిద్రపట్టదు. వాళ్ల ఎమోషన్?ని ఏదో ఒక రూపంలో బయటకు తీసుకురావాలని ప్రయత్నిస్తారు. అయితే వ్యూయర్స్, క్రియేటర్స్?కి మధ్య ఉండేది వర్చువల్ రిలేషన్ కాబట్టి కామెంట్స్, వీడియోలతో రిప్లయ్ ఇస్తారు. కానీ, అదే నిజజీవితంలోనూ అప్లయ్ చేయాలనుకోవడం తప్పు. ఎందుకంటే వాస్తవానికి మనవాళ్లతోనే మనకు ఇబ్బందులు ఉంటాయి. కొన్ని మనకు నచ్చవు.. అలాగని, వెంటనే ఎమోషనల్? అయిపోవడం వల్ల నలుగురిలో చులకన అవుతారే తప్ప గౌరవాన్ని పొందలేరు. అయితే అందరూ ఇలా ఉంటారని కాదు.. అలా ఉండేవాళ్లు వాళ్ల తీరు మార్చుకోవాల్సిందే అని. కాకపోతే, ఇక్కడ మరో విషయం.. ఎమోషనల్ బ్యాలెన్స్ చేయలేనివాళ్ల వెనక మరో కథ ఉంటుంది. అదేంటంటే.. వాళ్లు అప్పటికే మనసులో ఏదో ఒక బరువును మోస్తూ ఉంటారు. నిరుదోగ్యం, నిరాశ, అసంతృప్తి, ఒత్తిడి ఇలా ఏదో ఒక సమస్యతో నలిగిపోతుంటారు. అలాంటివాళ్లు సడెన్?గా ఎమోషనల్ బ్యాలెన్స్ మిస్? అవ్వడం సహజం. అలాంటివాళ్లను అర్థం చేసుకోవాలే తప్ప, చిన్నచూపు చూడకూడదు.

**నో బాండింగ్:** ఈ మధ్యకాలంలో వచ్చిన కేసుల్లో ఎక్కువగా యువతే ఉన్నారు. వాళ్లకు తమ తల్లిదండ్రులతో కమ్యూనికేషన్ ఉండట్లేదు. ఫ్యామిలీ అంతా ఒకే ఇంట్లో ఉన్నా ఒకరితో ఒకరికి సత్సంబంధాలు లేవు. 'పిల్లలు ఏదో ఆన్?లైన్ గేమ్స్ ఆడుతున్నారు అని పేరెంట్స్.. మా ఎంజాయ్?మెంట్ మాదే' అని పిల్లలు.. 'ఎవరికివారే యమునాతీరే' అన్నట్టుంది నేటి సొసైటీ. కానీ, వాళ్లు ఆడే గేమ్స్?లో గన్స్, ఫైర్, ఫైట్స్ చూసి తెలియకుండానే అగ్రెసివ్ అవుతున్నారు. మాటామాటా పెరిగిందంటే.. చిన్నా పెద్దా అని చూడకుండా అటాక్ చేసేస్తున్నారు. గేమ్స్ ఆడితే అంత అగ్రెసివ్ అవుతారా? అంటే.. అవును. అవతలివాళ్లు గెలుస్తారేమోనని టెన్షన్, తనే గెలవాలి అని కసి.. తనే గ్రేట్ అనిపించుకోవాలి. రివార్డ్స్ అన్నీ తనకే రావాలి అని.. ఇలా ఆలోచిస్తూ గేమ్ ఆడుతుంటారు. అలాంటప్పుడు వాళ్లని నార్మల్?గా పిలిచినా కోప్పడిపోతుంటారు. ఎందుకు ఇలా? అంటే.. ఇంట్లోవాళ్లు తమ ఎమోషన్స్?ని? షేర్ చేసుకోవట్లేదు.. వాళ్ల మనసులో ఏముందో తెలుసుకోవడానికి ముందే జడ్జ్ చేసేస్తున్నారని చెప్తారు. ఇదంతా.. పేరెంట్స్?తో పిల్లలు టైం స్పెండ్ చేయకపోవడం వల్లే!

**డిజిటల్ నిరక్షరాస్యత:** కొంతమంది పేరెంట్స్?కి పిల్లల ప్రవర్తన? అర్థమైనా.. దాన్నెలా కంట్రోల్ చేయాలో తెలియట్లేదు. కారణం ఏంటంటే వాళ్లకు టెక్నాలజీ పట్ల సరైన అవగాహన లేకపోవడమే. టెక్నాలజీని వాడొద్దు అని చెప్పలేరు. ఏది మంచిదో ఏది కాదో చెప్పే బాధ్యత వాళ్లదే కాబట్టి.. ఎలా, ఎందుకు వాడాలో చెప్పొచ్చు. అలాగే ఎప్పుడూ డిజిటల్ ప్లాట్?ఫామ్స్?కి అతుక్కుపోకుండా అప్పుడప్పుడు ఫ్రెండ్స్?తో బయటకు వెళ్లమనాలి. ఎప్పుడో ఒక సందర్భం ఉంటేనే కలుసుకోవడం కాకుండా.. ఫ్యామిలీ గెట్? టు గెదర్స్ తరచూ జరగాలి. ఇలాంటివన్నీ అలవాటు చేయకపోతే.. మున్ముందు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందో చెప్పలేం. అసలే ఈ కాలం పిల్లలకు ఇతరులను హర్ట్ చేయకూడదు అనే ఆలోచన ఉండట్లేదు. ఎవరైనా బాధ పడినా, అందుకు కారణం వాళ్లే అని రిగ్రెట్ ఫీలవ్వట్లేదు.

**ఇలా ఉంటే..:** ఎప్పుడూ ఏదో బాధలో ఉండడం, ఏదో కోల్పోయినట్టు భావించడం, చిరాకు, రెండు వారాలపాటు ఏమీ తోచని స్థితిలో ఉండడం, తరచూ ఏడవడం, భయపడడం, రోజుల తరబడి ఆకలి లేకపోవడం, నిద్రలేమి, ఎక్కువగా తినడం, నేనెందుకు ఇలా ఉన్నాను? అనే ఆలోచనలు, చేయడం. ఎవరినీ కలవాలని, ఏ పనీ చేయాలని లేకపోవడం. కొందరు ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు చేస్తుంటారు. సింపుల్?గా చెప్పాలంటే ఏ ఎమోషన్? అయినా తమ చేయి దాటి పోతుంది అనిపించినప్పుడు వెంటనే అలర్ట్ అవ్వాలి. నార్మల్?గా ఉండేవాళ్ల ఎమోషన్స్?లో ఒక్కసారిగా భిన్నమైన మార్పు కనిపిస్తే అది మానసిక సమస్య అయ్యే చాన్స్? ఉంది. ఒక్కసారి సైకాలజిస్ట్? దగ్గరకు వెళ్తే మీ మనసు ఏం కోరుకుం టుందో తెలుసుకుని దానికి తగ్గట్టు పరిష్కారం చూపిస్తారు. అందుకోసం ఆన్?లైన్ కన్సల్టేషన్ తీసుకోవచ్చు.

# కోట మృతిపై ప్రధాని మోదీ స్పందన





**హైదరాబాద్ పెన్ పవర్:**టాలీవుడ్ సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కోట మరణం పట్ల ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. "కోట శ్రీనివాసరావు గారి మరణం బాధాకరం. ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞకు గుర్తుండిపోతారు. తరతరాలుగా ప్రేక్షకులను తన అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సామాజిక సేవలో కూడా ఆయన ముందంజలో ఉన్నారు మరియు పేదలు మరియు అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారు.

ఆయన కుటుంబానికి, అసంఖ్యాక అభిమానులకు నా సంతాపం. ఓం శాంతి" అంటూ మోదీ తన ట్వీట్ లో పేర్కొన్నారు.